మహాశక్తిగా... చైనా

ఆసియాలోనే కాక, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో కూడా చైనా మహాశక్తిగా రూపుదిద్దుకుంటోంది. ఇటీవల కాలంలో రాజకీయంగా, ఆర్థికంగా, సైనికంగా చైనా వేగంగా అభివృద్ధి సాధించింది.. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అగ్రరాజ్యాల ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయడంలో చురుకుగా వ్యవహరిస్తోంది. మరో పదేళ్లలో చైనా ప్రపంచంలోనే ఎదురులేని ఆర్థికశక్తిగా ఎదగగలదని విశ్లేషకుల అంచనా. ఇందుకనుగుణంగానే చైనా తన అభివృద్ధిని బహుముఖ రంగాలకు విస్తరించడమేకాక పొరుగు దేశాలలో శాంతి సుస్థిరతలు పరిఢవిల్లేలా కృషిని సాగిస్తోంది. ఈ నేపథ్యంలో చైనా సాధించిన అభివృద్ధి.. అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ వ్యూహాల సమాచారం.

చైనా అనితరసాధ్యాలకు నెలవుగా మారింది. ప్రాంతీయ శక్తిగానేకాక అంతర్జాతీయంగా తన ఉనికిని సుస్థిరం చేసుకుంటోంది. అతిపెద్ద దేశాల్లో ఒకటైన చైనా గత పదేళ్ల కాలంలో అంతర్గత సమస్యలను పరిష్కరించుకుంటూ, ఆధునికీకరణ దిశగా అడుగులు వేస్తోంది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అంచనాలకంటే ముందుగానే ఆవిర్భవించి అందర్నీ ఆశ్చర్యపరిచింది. అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రాజకీయ, ఆర్థిక, విదేశీ విధానాలను మార్చుకుని క్రియాత్మకంగా వ్యవహరిస్తోంది.

సైనిక ఆధునికీకరణ :

చైనా గత రెండు దశాబ్దాలుగా, ముఖ్యంగా గల్ఫ్ యుద్ధా నంతరం సైనిక వ్యవస్థను ఆధునికీకరించే దిశగా గట్టి చర్యలు తీసుకుంది. సమగ్ర సైనిక సంస్కరణలకు, ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. వైమానికి, నావిక దళాల అధిక ప్రాధాన్యం ఇచ్చి, రష్యా సరిహద్దు ప్రాంతంలో వీటిని మరింత పటిష్టపరిచింది. 2001లో రక్షణ బడ్జెట్‌ను 17.7 శాతానికి పెంచింది. అంతకుముందు వరుసగా 13 సంవత్సరాలపాటు రక్షణ బడ్జెట్ పది శాతానికి మించి కొనసాగించింది. ఇక తాజా బడ్జెట్‌లో రక్షణ కేటాయింపులు 35 శాతానికి చేరుకున్నాయి. ఇందులో 29 శాతం నిధులు వైమానిక దళానికి కేటాయించగా, పదాతి దళానికి కేటాయింపులను 29 శాతం తగ్గించింది. గత ఐదేళ్ల కాలంలో 4 బిలియన్‌డాలర్ల విలువైన సంప్రదాయ ఆయుధాలను, సైనిక సాంకేతికతను దిగుమతి చేసుకుని ప్రపంచంలో ఇటువంటి దిగుమతులు అత్యధికంగా చేసుకున్న 9వ దేశంగా నిలిచింది. అలాగే ఇదే కాలంలో 2,5 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను ఇతర దేశాలకు విక్రయించి అతి పెద్ద ఎగుమతుల దేశాలలో ఏడో స్థానం పొందింది. ఎస్.యు.-27, మల్టీరోల్ ఎయిర్ క్రాఫ్ట్‌లు, కేఏ-31 ఏఈడబ్ల్యూ హెలికాప్టర్లతోపాటు వాటి ఆయుధాల డిజైన్లను కూడా దిగుమతి చేసుకుని వైమానిక శక్తిని పెంచుకుంది. అలాగే కిలో క్లాస్ జలాంతర్గాములను, సావర్‌మెన్నీ తరగతికి చెందిన డెస్ట్రాయర్‌లను సమీకరించుకుంది. వీటితో కేవలం దక్షిణ చైనా సముద్ర జలాల్లోకేకాక హిందూ మహాసముద్రంలోకి లోతుగా చొచ్చుకు వెళ్లడమే చైనా ఉద్దేశంగా కనిపిస్తోంది. క్షిపణి రక్షణ వ్యవస్థ పరిధిని ఖండాంతర లక్ష్యాలకు పెంచింది. 1980లలో 4,75 మిలియన్ల సైన్యంతో ప్రపంచంలోనే అత్యధిక సైనిక శక్తిగల దేశంగా ఉన్న చైనా ఈ సంఖ్యను 1990ల్లో 2,5 మిలియన్లకు

తగ్గించింది. పెరుగుతున్న ఆధునిక సాంకేతికత నేపథ్యంలో ఎటువంటి యుద్ధాన్నైనా తట్టుకునే విధంగా పీఎల్ఏ (పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ)ని ఆధునికీకరించింది. అలాగే సమాచార యుద్ధాల్లో పైచేయి సాధించడానికి వీలుగా సైన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో నవీకరించడానికి జియాంగ్ జెమిన్ అధ్యక్షతన పనిచేస్తున్న చైనా సెంట్రల్ మిలటరీ కమిషన్ అధిక ప్రాధాన్యం ఇస్తోంది.

మారిన విదేశీ విధానం :

చైనా విదేశాంగ విధానంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ప్రపంచ శక్తిగా చైనా కొత్త హోదాను స్వీకరించినట్లు ఈ మార్పు సూచిస్తోందని విశ్లేషకుల అభిప్రాయం. 2006 నుంచి అన్ని దేశాలతో 'సామరస్య సంబంధాలు' ప్రాతిపదికన విదేశాంగ విధానాన్ని అమలుచేస్తోంది. బహుపాక్షిక సంబంధాలు, ఉమ్మడి అభివృద్ధి లక్ష్యంతో అందరి ఉన్నతి, సహనం, భిన్నత్వం అంశాలతో సామరస్యాన్ని పెంపొందించే హార్మోనియస్ రిలేషన్స్ విధానాన్ని చైనా అధ్యక్షుడు హూ జింటావో రూపొందించారు. సాధించిన ఆర్థికాభివృద్ధి రేటును నిలుపుకోవడానికి చైనా ఇప్పటికే అధిక స్థాయిలో చమురు ఇతర సహజ వనరులను దిగుమతి చేసుకుంటోంది. ఇటువంటి సహజ వనరులు అధికంగాగల లాటిన్ అమెరికా, ఆఫ్రికా, సెంట్రల్ ఆసియా దేశాలతో సత్సంబం ధాలు పెంచుకోడానికి కృషి చేస్తోంది. చైనా వస్తువులకు ఈ దేశాల్లో మంచి మార్కెట్ ఉండడం కూడా మరో కారణం. శాంతి భద్రతలు లేనిదే ఆర్థిక ప్రగతి నిరాటంకంగా కొన సాగటం అసాధ్యం. ఇందుకు పొరుగు దేశాలతో సఖ్యత ముఖ్యం. ఈ విషయాన్ని గ్రహించే విదేశాంగ విధానంలో అనువైన మార్పులు చేసుకుంది. మొండి వైఖరితో ఉన్న ఉత్తర కొరియాను చర్చలకు ఒప్పించడంలో చైనా ప్రదర్శించిన దౌత్యనీతి ప్రపంచ దేశాల ప్రశంసనందుకుంది. ఉత్తర కొరియా తన ఆర్థిక ప్రగతికి కావాల్సిన చమురు, ఇతర సహజవనరులను తీసుకుని ప్రతిగా అణ్వస్త్ర తయారీ కార్యకలాపాలను నిలుపుచేస్తానని ఈ చర్చల్లో ఒప్పుకుంది. ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక

మిలియన్ డాలర్లను సమకూర్చింది. 2006లో అభివృద్ధి చెందుతున్న 86 దేశాలకు ఆర్థిక సాయాన్ని అందజేసింది. మిలటరీ ఆధునికీకరణకు చైనా తీసుకుంటున్న చర్యల్లో పారదర్శకత లేకపోవడాన్ని అమెరికా, జపాన్ దేశాలు విమర్శిస్తున్నాయి. అంగోలా, సూడా న్ వంటి అవినీతికర, ప్రజావ్యతిరేక ప్రభుత్వాలతో చైనా మిత్రత్వం, వాటికి ఐరాసలో తమ అధికారం ద్వారా మద్దతు పలకడాన్ని పశ్చిమ దేశాలు తీవ్రంగా నిరసించాయి.

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనా పాత్ర:

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రబల శక్తిగా ఎదగడానికి చైనా కృషి చేస్తోంది. ప్రపంచంలో అత్యధిక జనాభా, శ్రామిక శక్తి కలిగిన దేశంగా అభివృద్ధిని కొనసాగిస్తూనే ఈ ప్రాంతంపై పట్టుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ప్రచ్ఛన్న యుద్ధానంతరం ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భద్రత- చైనా, అమెరికా,

జపాన్‌ల మధ్య కొనసాగే సుస్థిర సంబంధాలపై ఆధారపడి ఉంది. వీటి మధ్య దిగజారుతున్న సంబంధాలు ఈ ప్రాంతం భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. అణ్వస్త్ర దేశంగా, ప్రాంతీయంగా ఎదురులేని సైనిక శక్తిగా, ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశంగా చైనా నిర్మాణాత్మక పాత్ర వహిస్తే తప్ప ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలు సాధ్యం కావని అమెరికా రక్షణ శాఖ అభిప్రాయ పడుతోంది. ఈ ప్రాంతంలో దేశాల మధ్య సముద్ర జలాలకు సంబంధించి ఎడతెగని సరిహద్దు వివాదాలున్నాయి. స్ప్రాట్లిస్ దీవులు, పరాసెల్స్, తక్సిమా దీవులే ఇందుకు ఉదాహరణలు. ఉత్తర భూప్రాంతం విషయంలో రష్యా, జపాన్‌ల మధ్య వివాదం కొనసాగు తోంది. దీటైన సైనికశక్తిగా ఎదుగుతున్న చైనా పట్ల పొరుగు దేశాలు అభద్రతా భావనకు గురవుతున్నాయి. దీనికి తోడు చైనా ఘర్షణాత్మక వైఖరి మరిన్ని సమస్యలను తెచ్చి పెడుతోంది. 1996లో చైనా తైవాన్‌కు దగ్గరలో క్షిపణులను ఎక్కుపెట్టింది. ఈ చర్య అంతర్జాతీయ జలాల్లోని తైవాన్ జలసంధుల్లో షిప్పింగ్ కార్యకలాపాలకు నిలిచిపోయేటట్లు చేసింది. చైనా దుడుకుతనాన్ని అదుపుచేసేందుకు జపాన్, తైవాన్‌లు అమెరికాతో తమ సంబంధాలను మరింత పటిష్టం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. చైనాకు చెక్ పెట్టేందుకు ఇక్కడ క్షిపణి రక్షక వ్యవస్థ ఏర్పాటు అవస రమని అమెరికా వాదిస్తోంది.

చైనా ఆర్థిక వ్యవస:

చైనా ఆర్థిక వ్యవస్థ సర్వతోముఖాభివృద్ధి చెందుతోంది. గత కొన్నేళ్లుగా దేశ ఆర్థిక వృద్ధి రేటు పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వ సంస్థల పనితీరులో సమూల మార్పులు తీసుకొచ్చింది. పారిశ్రామిక, మౌలిక నిర్మాణాల అభివృద్ధి, పెరుగుతున్న విదేశీ పెట్టుబడులు, ప్రపంచ వాణిజ్యసంస్థలో సభ్యత్వం చైనా ఎదుగుదలకు దోహదం చేశాయి. 2007, జనవరిలో చైనా విదేశీ మారక నిల్వలు ట్రిలియన్ డాలర్లకు చేరుకుని ప్రపంచంలోనే అత్యధిక విదేశీ మారక నిల్వలు కలిగిన దేశంగా నమోదైంది. కనివినీ ఎరుగని పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, అంతర్గత పెట్టుబడులతో చైనా జాతీయోత్పత్తి గత ఐదేళ్లలో రెట్టింపైంది. ప్రస్తుతం చైనా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2.7 ట్రిలియన్ డాలర్లు. నిర్మాణ, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులను 25 వాతం పెంచింది. ఇది ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచింది. ఉక్కు, కార్ల ధరలు పడిపోవడం గమనిస్తే ఆ రంగాల్లో ఉత్పత్తి అవసరానికి మించి పోయిందని స్పష్టమవుతోంది. అయితే 1.3 బిలియన్ల జనాభా కలిగిన చైనా తలసరి ఆదాయం మాత్రం 2 వేల డాలర్లు.

ఈ ఏడాది జనవరిలో చైనా ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. మూడో స్థానంలో ఉన్న జర్మనీని నాల్గో స్థానానికి నెట్టి వేసింది. అనుకున్న సమయం కంటే ముందుగానే చైనా ఈ స్థాయిని అందుకోవడం విశ్లేషకులను ఆశ్చర్యపరచింది. 2008లో ప్రపంచ ఆర్థికవ్యవస్థ మాంద్యంలో చిక్కుకోవడంతో చైనా స్థూల జాతీయోత్పత్తి గత ఏడేళ్లలో ఎన్నడూ లేని విధంగా 9 శాతంగా నమోదైంది. గత ఫిబ్రవరిలో చైనా ఉత్తర ప్రాంతంలోగత 50 ఏళ్లలో ఎన్నడూ లేని తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి. లక్షలాది ప్రజలు మంచినీరు కూడా దొరకక ఇబ్బందులు పడ్డారు. చైనా కరవు ఎమర్జెన్సీని ప్రకటించింది.

అయినప్పటికీ దేశంలో గోధుమ సరఫరాకు, బియ్యం వంటి ఆహార పదార్థాల భద్రతకు భంగం వాటిల్ల లేదు. పెరిగిపోతున్న నిరుద్యోగం చైనాకు ఆందోళన కలిగిస్తోంది. నిరుద్యోగుల సంఖ్య ఈ ఏడాది పతాక స్థాయికి చేరి ప్రభుత్వానికి సవాలుగా పరిణమించిందని చైనా ఎకనమిక్ మానిటరింగ్ అండ్ అనాలిసిస్ సెంటర్ సర్వే చెబు తోంది.

భారత్ భయాలు :

చైనా తన సైనిక శక్తిని అపారంగా పెంచుకోవడం, ఆయుధ సంపత్తిని ఆధునీకరించడంలో రాజీలేని ధోరణి ప్రదర్శించ డం పొరుగు దేశం భారత్‌కు ఆందోళన కలిగించే అంశాలు. టిబెట్‌లో మిలటరీ స్థావరాలు ఏర్పాటు చేయడం, మయన్మార్, శ్రీలంక, బంగ్లాదేశ్, మాల్దీవులు, సెషల్స్ వంటి పొరుగు దేశాలకు సైనిక సహకారం అందించడం పట్ల భారత్ అభ్యంతరాలను వ్యక్తం చేసింది. చైనా ఇటీవల యాంటీ శాటిలైట్ ఆయుధాలను సమకూర్చుకోవడంతో భారత్, చైనా సరిహద్దు ప్రాంతంలో కూడా ఆ దేశం సైనిక పరంగా పై చేయిలో ఉందని.. పాక్, చైనాల సైనిక సహకారం కూడా భారత్‌కు అనుకూలమైన అంశం కాదని రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు.

చైనా చరిత్ర.. ముఖ్య ఘట్టాలు

- 1949 : అక్టోబర్ 1న పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా అవతరణ
- 1953–59 : కొరియా యుద్ధం.. అమెరికా నేతృత్వంలోని ఐరాస దళాలతో చైనా పోరాడింది
- 1958 : తీవ్ర కరవు..30 లక్షల మంది చనిపోయారని అంచనా
- 1959 : టిబెట్‌లో తిరుగుబాటు అణిచివేత. అనుచరులతో దలైలామా భారత్ చేరిక.
- 1962 : భారత్–చైనా సరిహద్దు యుద్ధం
- 1964 : చైనా తన మొదటి అణు బాంబు పరీక్ష
- 1971 : ఐరాసలో తైవాన్ సభ్యత్వాన్ని కైవసం చేసుకున్న చైనా
- 1972 : అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ చైనా పర్యటన
- 1976 : మావో జెడాంగ్ మృతి
- 1978 : చైనా అధినేతగా డెంగ్ జియోపింగ్ ఎన్నిక
- 1989,జూన్ : తయాన్మిన్ స్క్వేర్‌లో నిరసనకారుల అణిచివేత, అనేక మంది మృతి
- 1993 : చైనా అధ్యక్షుడిగా జియంగ్ జెమిన్ ప్రమాణం
- 1997 : డెంగ్ జియోపింగ్ మృతి. హాంగ్‌కాంగ్‌ను తిరిగి చైనాకు ఇచ్చివేసిన బ్రిటన్
- 2001 : ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో చైనా చేరిక
- 2003 : చైనా ఆరో అధ్యక్షుడిగా హూ జింటావో ప్రమాణం
- 2003 : చైనా ప్రధానిగా వెన్ జియాబో ప్రమాణం